క్లుప్తంగా

పాఠశాలల్లో డీఈఓ తనిఖీలు



షికారుగంజి మోడల్ స్కూల్‌లో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి మోడల్ స్కూల్, రామచంద్రాపురం, పి.లింగాలవలస ఉన్నత పాఠశాలల్లో డీఈఓ లింగేశ్వర రెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. పాఠశాలల్లోతరగతి గదులు, ఇతర సదుపాయాలు, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించడంతో పాటు ఎమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. బైజూస్ కంటెంట్‌తో ప్రభుత్వం ఇటీవల అందజేసిన ట్యాబ్‌లను 8వ తరగతి విద్యార్థులు వినియోగించేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల దేనని అన్నారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గర పడుతున్నందున ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అభినందన



వ్యాయామ ఉపాధ్యాయుడు, విద్యార్థులను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): రాష్ట్రస్థాయి బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్-14, 17 విభాగాల్లో నాలుగు స్వర్ణ పతకాలు, ఒక రజతం సాధించిన గరివిడి మండలం వెదుళ్లవలస ఉన్నత పాఠశాల విద్యార్థులు, వారికి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్.సూర్యనారాయణను పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడిని, తక్కువ సెలవులు వినియోగించుకున్న తెలుగు ఉపాధ్యాయుడు ధనుంజయాచారిని వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములునాయుడు, సర్పంచ్ గుడివాడ తమ్మినాయుడు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గాంధీబాబు సత్కరించారు. హెచ్‌ఎం సీహెచ్ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన



పాఠశాలలోని ఫిర్యాదుల పెట్టెను పరిశీలిస్తున్న అప్పారావు

గుర్ల: మండలంలోని తెట్టంగి ఉన్నత పాఠశాలను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు శనివారం సందర్శించారు. పాఠశాలలో తరగతిగదులు, సదుపాయాలను, విద్యార్థినులు సమస్యలను తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్సును పరిశీలించారు. ఫిర్యాదు బాక్సును సచివాలయ మహిళా పోలీస్ సమక్షంలో తెరవాలని, వాటిలో ఉన్న ఫిర్యాదు లను పరిశీలించి సమస్యలను పరిష్కారించాలని హెచ్‌ఎం హైమావతిని ఆదేశించారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గరపడుతున్నందున వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

క్యాన్సర్‌పై అవగాహన

గుర్ల: కెల్ల గ్రామంలో రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి సత్యం క్యాన్సర్‌పై గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. ప్రస్తుత కాలంలో ప్రజల ఆహార అలవాట్లే అనేక రోగాలకు కారణమవుతున్నాయని ఆయన అ న్నారు. పౌష్టికాహార లోపంతో మహిళల్లో రక్త హీనత సమస్య తలెత్తుతోందని, విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వైద్యాధికారి లెనిన్, పంచాయతీ కార్యదర్శి జగన్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

గంట్యాడ: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేయించాలని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు రెడ్డి కృష్ణ అన్నారు. మండలంలోని నరవ గ్రామంలో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 31 వతేదీ వరకు పశు వైద్య సిబ్బంది గ్రామాలకు వచ్చి టీకాలు వేస్తారని తెలిపారు. పశువులకు అత్యవసర సమయంలో వైద్యం కోసం వైఎస్సార్ సంచార పశు వైద్య శాల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సేవల కోసం ట్రోల్‌ఫ్రీ నంబర్ 1962కు ఫోన్ చేయాలని చెప్పారు.

భయం వీడండి

కొత్తవలస: పబ్లిక్ పరీక్షలు అంటే భయం వీడాలని, ఒత్తిడిని అధిగమించి ప్రశాంతంగా పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి(డీసీఓ)డి.చంద్రావతి విద్యార్థినులకు సూచించారు. మండలంలోని వియ్యంపేట గ్రామం సమీపంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలను శనివారం ఆమె సందర్శించారు. రికార్డులు, భోజనాలు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలలో నిర్వహించిన ఫేర్‌వెల్ వేడుకల్లో పాల్గొన్నారు. పదోతరగతి విద్యార్థులకు పరీక్షల్లో పాటించాల్సిన మెలకువలను వివరించారు. ప్రిన్సిపాల్ టి.జయశ్రీ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థన



చీపురుపల్లి: జి.అగ్రహారంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామాల్లో శనివారం ముమ్మరంగా నిర్వహించారు. ఓటు హక్కు ఉన్న పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో జి.అగ్రహారం, ఆకులపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య బొండపల్లి మండలంలోని వెదురువాడ, కొత్తపాలెం, జె.గుమడాం, మరువాడ, ఎం.కొత్తవలస, బి.రాజేరు, చిన్నతామరాపల్లి, జి.పి.అగ్రహారం, దేవుపల్లి, గొల్లుపాలెం గ్రామాల్లో, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఎస్.కోట మండలంలోని కొట్టాం, కృష్ణాపురం, పోతనాపల్లి, సంతగవిరమ్మపేట గ్రామాల్లో, ఎస్.కోట పట్టణంలో ఎమ్మెల్సీ రఘురాజు, కొత్తవలస మండలంలోని పలుగ్రామాల్లో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు ప్రచారం చేశారు. అలాగే వేపాడ, గరివిడి, గుర్ల మండలాల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు నాయకులు పాల్గొన్నారు. - సాక్షి నెట్ వర్క్



శృంగవరపుకోట: సుధాకర్‌కు ఓటు వేయాలని కృష్ణాపురంలో ఓటరును కోరుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



బొండపల్లి: కొవ్వాడపేటలో గ్రాడ్యుయేట్ ఓటర్లతో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



చీపురుపల్లి రూరల్: గరివిడి మండలం శేరీపేటలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గుర్ల: కోటగండ్రేడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు



శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు



కొత్తవలస: గులివిందాడలో ప్రచారం చేస్తున్న నాయకులు



వేపాడ: వావిలపాడులో సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు

చట్టాలపై అవగాహన అవసరం

- న్యాయమూర్తులు సూర్యకిరణ్‌శ్రీ, వాణి



కొత్తవలస: మాట్లాడుతున్న న్యాయమూర్తి సూర్యకిరణ్‌శ్రీ



శృంగవరపుకోట: మాట్లాడుతున్న న్యాయమూర్తి వాణి

కొత్తవలస: మహిళలు తప్పనిసరిగా చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్‌శ్రీ అన్నారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయసేవా సంస్థ ఆదేశాల మేరకు స్థానిక జూనియర్ జడ్జి కోర్టులో అంగన్‌వాడీ కార్యకర్తలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తి మాట్లాడుతూ వివాహాలను తప్పనసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు. ఆడపిల్లలు వారి కాళ్లపై వారు జీవించే విధంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లులదేనని, మగవారితో పాటు ఆడపిల్లలకూ ఆస్తి హక్కులో సమానవాటాను కల్పిస్తూ చట్టాలు ఉన్నాయన్నారు. ఈ సదస్సులో తెలుసుకున్న అంశాలపై మహిళలకు అవగాహన కల్పించే బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళుతున్న పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టి వారి నడవడికను గమనించాలని తల్లిదండ్రులకు సూచించాలని చెప్పారు. చిన్నచిన్న విష యాలకు గొడవలు పడి కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకోవద్దని ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం న్యాయవాది గొడుగుల మహేంద్ర మాట్లాడుతూ ప్రాంసరీ నోట్లు, భూ చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు శ్రీనివాసరావు, గవర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో రాణించాలి..

శృంగవరపుకోట: అవకాశాలను అందిపుచ్చుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని న్యాయమూర్తి ఎస్.వాణి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ మహిళా సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా న్యాయ సేవాసాధికార సంస్థ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు శనివారం న్యాయఅవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం వహించేలా ఎదగాలన్నారు. మహిళా రక్షణకు సంబంధించిన చట్టాలపై, న్యాయసేవాసాధికార సంస్థ నుంచి న్యాయ సహాయం ఎలా పొందాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్.కోట బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు అల్లు సత్యాజీ, సీనియర్ న్యాయవాదులు జి.సూరిదేముడు, జి.ప్రకాశ్, వారాది ఈశ్వరరావు, టి.వి.ఆర్.మూర్తి, ఆర్.సత్యనారాయణ, డి.త్రినాథ్, ఎం.అనూరాధ పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులాహ్వానం

వేపాడ: స్థానిక ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో అయిదోతరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రిన్సిపాల్ ఉషారాణి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.ఎస్సీ, ఎస్టీ బాలికలు 2010 సెప్టెంబర్ నుంచి 2014 ఆగస్టు 31 లోపు , బీసీ, బీసీ-సీ, ఓసీ బాలికలు 2012 సెప్టెంబర్ ఒకటి నుంచి 2014 ఆగస్టు 31లోపు జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. బాలికలు ఇదే జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపుపొందిన పాఠశాలలో 2021-22 విద్యాసంవత్సరంలో మూడోతరగతి, 2022-23లో నాలుగో తరగతి చదువు పూర్తి చేసి ఉండాలని, తల్లి, తండ్రి లేదా సంరక్షకుని వార్షిక ఆదాయం లక్షరూపాయలు మించి ఉండకూడదని వివరించారు. ఆసక్తి గల వారు హెచ్‌టీటీపీ: //ఏపీజీపీసీఈట. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో మార్చి 24లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తు కాపీని వేపాడలోని గురుకుల పాఠశాలకు అందించాలని తెలిపారు. ఆబ్జెక్టివ్ విధానంలో తెలుగు 10 మార్కులు, ఇంగ్లిష్ 10, గణిత15, ఎన్విరాన్‌మెంట్ సైన్స్15, మొత్తం 50 మార్కులకు పరీక్ష నిర్వహించి, మార్కులు ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కండి



వేపాడ: వల్లంపూడి లేఅవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ



కొత్తవలస: బలిఘట్టాం గ్రామంలోని లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తవలస: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు ఉగాది నాటికి పూర్తిచేసి సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలని హౌసింగ్ ఏఈ రాంప్రసాద్ సూచించారు. హౌసింగ్‌డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని బలిఘట్టాం గ్రామ సమీపంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాలకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక, రాయితీపై సిమెంట్, ఐరన్ అందించడంతో పాటు అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామని, పనులను వేగవంతం చేయాలని లబ్ధిదారులను కోరారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మి,సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలి

వేపాడ: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని మండల ప్రత్యేక అధికారి పి.ఎస్.ఎన్ లక్ష్మీనారాయణ లబ్ధిదారులకు సూచించారు. వల్లంపూడి జగనన్న లేఅవుట్ లో ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి, నిర్మాణాలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన బిల్లులు కాకుండా ఇంకా డబ్బులు అవసరమైతే ఐకేపీ ద్వారా రుణం పొందవచ్చని చెప్పారు. లేఅవుట్‌లో రోడ్డు ఏర్పాటు చేయాలని, నిత్యం నీటి సరఫరా చేసేలా చూడాలని లబ్ధిదారులు అధికారుల ను కోరగా, సమస్యను పరిష్కరిస్తామని ప్రత్యేక అధికారి తెలిపారు. వల్లంపూడి లేఅవుట్‌లో పట్టాలు పొందిన వారితో పాటు గ్రామంలో సొంత స్థలం ఉన్న వారికి కలిపి 153 ఇళ్లు మంజూరు చేశామని ఆయన చెప్పారు. వీటిలో 40 నిర్మాణాలు పూర్తయ్యాయని, 93 వివిధ దశల్లో ఉన్నాయని, 20 మంది లబ్ధిదారులు ఇంకా పనులు ప్రారంభించలేదని తెలిపారు. ఎంపీడీఓ పట్నాయక్, పీఆర్ ఏఈ ఆలీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి, ఉపాధి హామీ ఏపీఓ సన్యాసినాయుడు, ఏపీఎం శ్రీనివాసరావు, ఏఈ అప్పలనాయుడు, విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ విజయ్, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు పక్కాగా ఏర్పాట్లు

- కలెక్టర్ సూర్యకుమారి



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

శృంగవరపుకోట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ సూర్యకుమారి అధికారులను ఆదేశించారు. ఎస్.కోట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు, బారికేడ్లు, క్యూలైన్లు వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లకు స్లిప్పుల పంపిణీ త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆ పాఠశాలలో 9,10 తరగతుల విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు.అనంతరం తిమిడి గ్రామంలో చేపడుతున్న భూముల రీసర్వే పనులను పరిశీలించారు. సర్వేను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు.ఆమె వెంట తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, మండల అధికారులు ఉన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు



మాట్లాడుతున్న న్యాయమూర్తి కనకలక్ష్మి

బొండపల్లి: మహిళల రక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను రూపొందించి, పకడ్బందీగా అమలు చేస్తున్నాయని, వాటిపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని గజపతి నగరం ఫస్ట్‌క్లాస్ మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి బి.కనకలక్ష్మి అన్నారు. ఈనెల8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలకు వివిధ చట్టాలు, సఖి గ్రూపుల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం దిశ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. 18 ఏళ్లు నిండకుండా బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, గ్రామాల్లో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే చైల్డ్ హెల్ప్‌లైన్‌కు కాని, పోలీసులకు కాని సమాచారం అందించాలని సూచించారు. కౌమార బాలికలకు పౌష్టికాహారంఅందించి రక్తహీనత సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.కె.దుర్గా ప్రసాద్, ఎంపీడీఓ ఏ.వేదవతి, ఎంఈఓ బూసినాయుడు, న్యాయవాదులు రమణాజీ, పి.శ్రీనివాసరావు, కె.సాయికుమార్, రాపాక సాయి, పి. ఆదినారాయణ, జి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ పరిశీలన

గజపతినగరం: మండలంలోని ఎం.వెంకటాపురం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన జననీ సెషన్ వ్యాక్సినేషన్ కేంద్రాన్ని జిల్లా వ్యాక్సినేషన్ అధికారి జగదీష్ శనివారం పరిశీలించారని వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి తెలిపారు. ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు పిల్లలకు టీకాలు వేసే విధానం గురించి అడిగి తెలుసుకొన్నారు.రికార్డులు పరిశీలించి సిబ్బంది అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

శృంగవరపుకోట: జిల్లాలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జనని ప్రోగ్రాంపై శనివారం కొట్టాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సూర్యనారాయణ, డీఈఎంఓ చినతల్లి పర్యవేక్షించారు. కార్యక్రమం అమలవుతున్న తీరు, సిబ్బంది పనితీరు సమీక్షించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ తారకరావుతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



శృంగవరపుకోట: కొట్టాం పీహెచ్‌సీలో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఉత్కంఠగా... ఉల్లాసంగా



పోటీల్లో దౌడు తీస్తున్న గుర్రాలు

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో రామాలయం వార్షికోత్సవాన్ని సర్పంచ్ బుద్దా చిన్నమ్ములు,అప్పలనాయుడు దంపతుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో భాగంగా సాయంత్రం నిర్వహించిన గుర్రాల పరుగు పోటీలు ఉత్కంఠగా సాగాయి. విజయనగరం, విశాఖపట్నం ,అనకాపల్లి జిల్లాలకు చెందిన 15 గుర్రాలు పోటీలో పాల్గొనగా.. రామన్నపాలెంకు చెందిన చోడమాంబ విక్రమ్ గుర్రం మొదటిస్థానంలో నిలిచి రూ.12 వేల నగదు బహుమతి గెలుచుకుంది, తర్వాత వరుస ఆరు స్థానాల్లో నిలిచిన గుర్రాలకు నగదు బహుమతి అందజేశారు. బహుమతుల ప్రదానంలో డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఎంపీటీసీ టి.వి.రమణ, గ్రామపెద్దలు బుద్దా అప్పలనాయుడు వార్డు మెంబర్లు, పలుగ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



జబర్దస్త్ నటీనటుల ప్రదర్శన

అలరించిన జబర్దస్త్ బృందం

రామాలయం వార్షికోత్సవం సందర్భంగా జాకేరులో శుక్రవారం రాత్రి జబర్దస్త్ బృందంప్రదర్శించిన హాస్యవల్లరి కార్యక్రమం జనాలను అలరించింది. ఎస్.కోట అప్పారావు, గెడ్డం నవీన్, నెమలి రాజా,సత్తిపండు, వినోదిని, హరిత, తన్మయి, లాఫింగ్ లక్ష్మీల బృందం ప్రదర్శనలు జనాలను కడుపుబ్బా నవ్వించాయి.

ఆడపిల్లల ఆరోగ్యం, అభ్యున్నతే లక్ష్యం



చీపురుపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు



మెరకముడిదాం: మాట్లాడుతున్న ప్రత్యేకఅధికారి నిర్మలాదేవి



జామి: మాట్లాడుతున్న ఎంపీడీఓ సతీష్

చీపురుపల్లి: బాలికల సంపూర్ణ ఆరోగ్యం, విద్య, మహిళల అభ్యున్నతే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో 9 నుంచి 21 ఏళ్లలోపు ఆడపిల్లలతో సఖి గ్రూపులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సఖి కార్యక్రమంపై మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు, మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించేందుకు సఖి సమావేశాలు దోహద పడాలని, నెలలో ప్రతీ నాలుగో శనివారం గ్రామస్థాయిలో ఈ సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. కౌమార బాలికలకు పాఠశాలల్లో, వసతిగృహాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకునే విధంగా చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రతీ ఆడపిల్ల కనీసం డిగ్రీ వరకు చదువుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, ఇన్‌చార్జి ఎంఈఓ భానుప్రకాష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం..

వేపాడ: బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ పి.ఎస్.ఎన్. లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో 'సఖి' గ్రూపుల నిర్వహణపై శనివారం సమీక్షించారు. బాలికలంతా చదువుకునేలా చూడాలని, మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీఓ పట్నాయక్, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, ఏఈలు ఆలీ, అప్పలనాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కామేశ్వరి, ఏపీఎం సన్యాసినాయుడు, ఏపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్చాలి

జామి: గ్రామాల్లో మధ్యలో చదువు ఆపేసిన బాలికలను గుర్తించి వారిని మళ్లీ బడిలో చేర్పించేందుకు సఖి గ్రూపు సభ్యులు కృషి చేయాలని ఎంపీడీఓ సతీష్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది, మహిళా పోలీసులు, ఇతర శాఖల అధికారులతో 'సఖి' గ్రూపుల నిర్వహణపై శనివారం సమీక్షించారు. వైద్యాధికారులు భాగ్యరేఖ, పద్మావతి, ఐసీడీఎస్ పీఓ బి.ఉమ మాట్లాడుతూ బాల్య వివాహాల నియంత్రణలో సఖి గ్రూప్‌లు కీలక పాత్ర పోషించాలన్నారు.ఎంఈఓ జె.జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనే ధ్యేయం

దత్తిరాజేరు: గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనే ధ్యేయంగా సఖి గ్రూపులు పని చేయాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వైద్యాధికారి సతీష్,ఈఓపీఆర్డీ వాణిశ్రీతో కలిసి అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు,సచివాలయ మహిళా పోలీసులతో సఖి కార్యక్రమంపై శనివారం సమీక్ష నిర్వహించారు.



వేపాడ: అధికారులకు సూచనలు చేస్తున్న ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ

సమావేశాలు నిర్వహించాలి

మెరకముడిదాం: ప్రతీ సచివాలయంలో సఖి గ్రూపుల సమావేశాలను నెలకోమారు నిర్వహించాలని మండల ప్రత్యేకఅ ధికారి నిర్మలాదేవి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 9 నుంచి 21 ఏళ్ల లోపు ఆడపిల్లలలో సఖి గ్రూపులు ఏర్పాటు చేసిన మాదిరిగానే, నూతన వివాహిత మహిళలతో సహేలి గ్రూపులను ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీడీఓ పి.రామకృష్ణ, ఎంఈఓ రామారావు, ఏపీఓ ఎస్.పెద అప్పలనాయుడు, గర్భాం, మెరకముడిదాం పీహెచ్‌సీల వైద్యాధికారులు అజయ్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.